

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

నల్గొండ
యాదాద్రి
సూర్యాపేట

ఆదివారం 28, సెప్టెంబర్ 2025 పేజీలు - 8


# పేదవారెవరు గుడిసెల్లో నివసించరాదన్నది ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





**నల్గొండ జిల్లా బ్యూరో**

పేదవారెవరు గుడిసెల్లో నివసించరాదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శనివారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని అశోక ఫంక్షన్ హాల్ లో నల్గొండ మండలం, అన్నారెడ్డి గూడెంకు చెందిన 75 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేశారు.గ్రామంలో ఇంకా మిగిలిపోయిన పేదవారికి కూడా ఇండ్లను ఇస్తామని మంత్రి తెలిపారు. అన్నారెడ్డి గూడెంకు 17 ఇందిరమ్మ ఇండ్లను సైతం మంజూరు చేశామని, సొంత జాగా ఉన్న ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో మండలంలో రెండు, మూడు గ్రామాలలో కూడా ఇండ్లు కట్టి ఇవ్వలేదని అన్నారు. తమ ప్రభుత్వం ప్రతి నియోజక వర్గంలో 3500 ఇండ్ల చొప్పున మూడేళ్లలో ఇండ్లు లేని పేద వారందరికీ ఇండ్లు కట్టిస్తామన్నారు. పేదవారు ఎవరు గుడిసెల్లో నివసించరాదన్నది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అని తెలిపారు. ప్రస్తుతం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఆ ఇండ్లకు విద్యుత్తు, కలర్లు వేసుకోవాలని, దసరా లోపు గృహప్రవేశాలు చేయాలని, ఇందుకుగాను ప్రతి ఇంటికి తన వంతుగా 10000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తానని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు లేనివారికి రేషన్ కార్డులు ఇచ్చిందని, పదేళ్లలో గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, సన్న బియ్యం, ఉచిత విద్యుత్తు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక ప్రతిష్టాత్మక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. తాను ఎస్ఎల్బీసీ నిర్మాణానికి 2000 కోట్ల రూపాయలను తీసుకు రాగా, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల అది పూర్తి కాలేదని తెలిపారు. ఏఎంఆర్పి కాలువల లైనింగ్ చేయించడం జరుగుతున్నదని, నల్గొండ మండలంలో వందకోట్ల రూపాయలతో డబుల్ రోడ్ల నిర్మాణాలు చేపట్టామని వెల్లడించారు. రెవిన్యూ అధనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదు లక్షల నాలుగువేల రూపాయల వ్యయంతో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు పారదర్శకంగా కేటాయించినట్లు తెలిపారు. ఒక్కో ఇంటిపై 5, లక్షల 4000 రూపాయలతో పాటు అదనంగా లక్ష 25 వేల రూపాయలు ఖర్చు చేసి లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించనున్నట్లు చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్ మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఆఫీజ్ ఖాన్, డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

### పురివిప్పిన గంజాయి..

# గంజాయి మత్తులో హత్యలు

- పాత కక్షలతో పాటుగా మత్తులో తూలుతూ..
- తెగ నరుక్కుంటున్న యువకులు
- తాజాగా మరో ఘటనతో ఉలిక్కిపడ్డ పేట
- నిందితుల కోసం మూడు బందాలు గాలింపుచర్యలు



కుసుమవారిగూడెం క్రాస్ రోడ్డులో జరిగిన హత్య ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ



హత్యకు గురైన శివకుమార్ (ఫైల్ ఫోటో)

సూర్యాపేట ప్రతినిది, మేజర్‌న్యూస్ : ‘ సరిగ్గా సంవత్సరం క్రితం కోదాడ పట్టణంలో గంజాయి మత్తులో యువకులు కత్తులతో వీరంగం చేశారు. అంతటితో ఆగిపోకుండ ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సరిగ్గా రెండేళ్ల క్రితం సద్దుల చెరువు కట్టపై ఓ యువకుడిపై మద్యం గంజాయి మత్తులో కత్తులతో దాడి చేసి తెగనరికారు. సూర్యాపేట పాత జిల్లా పోలీసు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఓ వైన్స్‌లో శుక్రవారం రాత్రి పాత కోలను మనసులో పెట్టుకున్న మాతంగి మ‘దుతో పాటుగా మరికొంతమంది యువకులు మద్యం ,గంజాయి మత్తులో రాజీవ్‌నగర్‌కు చెందిన సారగండ్ల శివకుమార్‌ను కత్తులు గొడ్డళ్లతో తెగనరికి హత్య చేశారు. శివకుమార్‌పై కత్తులు గొడ్డళ్లతో పదుల సంఖ్యలో పోట్లు దింపారు. నిం‘దితుల మిగతా 3లో

### మూసీ అలర్ట్..

# మూసీకి పెరుగుతున్న నీటి ప్రవాహం



ప్రాజెక్ట్ నుంచి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు



సూర్యాపేట-మిర్యాలగూడ రహదారి పై మూసి నదిని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహా

- గేట్లు పదిలమేనా..?
- ఇప్పటికే తొమ్మిది గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- సూర్యాపేట-బీమారం రహదారిపై నిలిచిన రాకపోకలు
- మూసీ పరివాహక ప్రాంత ప్రజలను అలర్ట్ చేసిన మూసీ, పోలీసు అ‘దికారులు
- మూసీ పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు, ప్రస్తుత నీటి మట్టం : 643.20

సూర్యాపేట ప్రతినిది, మేజర్‌న్యూస్ : మూసీ పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు, ప్రస్తుత నీటి మట్టం : 643.20, హైద్రాబాద్ నగరంతో పాటుగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా గత రాత్రి నుంచి మోస్తర్ నుంచి భారీ వర్షం కురుస్తుంది. ఎగువన వర్షాలు పెద్ద ఎత్తున కురవడంతో సూర్యాపేట మండలంలోని రత్నపురం లో గల మూసీ ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరిగిపోయింది. దీంతో ఇప్పటికే మూసీ అ‘దికారులు ప్రాజెక్టుకు ఉన్న 20 గేట్లలో తొమ్మిది గేట్లను ఓపెన్ చేశారు. ఈ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేయడంతో మూసీ కాలువల్లో నీటి ప్రవాహం ఉ‘దతంగా ప్రవహిస్తుంది. జిల్లాలోని సూర్యాపేట, పెన్‌పహాడ్, మఠంపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు ప్రజలను అప్రమత్తం చేశారు. అంతేకాకుండా సూర్యాపేట బీమారం రహదారిపై ఉన్న మూసీ వాగు ఉప్పొంగుతుండడంతో రాకపోకలను నిలిపివేశారు.

**గేట్లు పదిలమేనా..?**

ఎగువ నుంచి దిగువనున్న మూసీ ప్రాజెక్టుకు రాత్రి నుంచి వరద ప్రవాహం పెరిగింది. గత మూడేళ్ల క్రితం మూసీ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోవడంతో ప్రాజెక్టులోని నీళ్లు రత్నపురం, యండ్లపల్లి గ్రామాల మీదుగా ప్రవహించాయి. అంతేకాకుండా గ్రామాలు మునకకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. అప్పట్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వెంటనే మూసీ గేట్ల ను మరమ్మతు చేయించారు. అయితే ఇప్పటికి మూసీ గేట్లపై అనుమానం లేకపోలేదు. శనివారం రాత్రి కూడా ఇదేమాదిరిగా మిగతా 3లో

# గజ్జెల చెన్నారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ ఎం.సీ కోటిరెడ్డి



గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : గుర్రంపోడ్ మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు గజ్జెల చెన్నారెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత హైదరాబాదులోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎం.సీ కోటిరెడ్డి శనివారం హైదరాబాదులోని గజ్జెల చెన్నారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ గుర్రంపోడ్ మండల బీసీ సెల్ అధ్యక్షులు మల్లోజు నాగార్జునా చారి ఉన్నారు.

# బదిలీపై వెళ్తున్న సిబ్బందికి వీడ్కోలు సమావేశం



గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : గుర్రంపోడ్ మండల కేంద్రంలోని శనివారం రోజున ఇందిరా క్రాంతి పథకం కార్యాలయంలో గత పది సంవత్సరాల విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ కోఆర్డినేటర్స్ బైరెడ్డి రాజేశ్వరి, తంగెళ్ల శేఖర్,బదిలీపై ఇతర మండలాలకు వెళ్లడంతో తోటి సిబ్బంది వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించినారు ఈ సందర్భంగా పూల మాలలతో శాలువాలతో సత్కరించారు అనంతరము వారు మాట్లాడుతూ మండలాన్ని మహిళా సంఘాలకు అందాల్సినటువంటి సంక్షేమ పథకాలు అందించడంలో తమ వంతు సహాయ సహకారాలు అందజేయడంతోపాటు తమ ఆధీనంలో పనిచేసినటువంటి వివో ఏలు కూడా తమకు సహకరించినారని వారికి సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్స్ అంజయ్య బి అంజయ్య సక్కుబాయి కిరణ్ అకౌంటెంట్ పద్మ, కంప్యూటర్ సంధ్య రాణి. వివో ఏల సంఘం అధ్యక్షురాలు సల్వాది సైదమ్మ,యాదయ్య, విష్ణు, శంకర్,అశోక్,నాగమణి,విమల, ప్రశాంతి, యాదమ్మ, సునీత,పుష్ప,పిఓఏలు మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యానికి మంత్రి పదవి ఇవ్వాలి

## తెలంగాణ రాష్ట్ర దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు దండు యాదయ్య



మునుగోడు, మేజర్‌న్యూస్ : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యానికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు దండు యాదయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత సమాజానికి అండగా నిలుస్తూ, సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికై కృషి చేస్తున్న సత్యం సేవలు అమూల్యమని ఆయన ప్రభుత్వానికి గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల ప్రజా సమస్యలను ఎప్పుటికప్పుడు ముందుకు తీసుకువస్తారని అన్నారు. దీంతో బడుగు బలహీన వర్గాల,దళిత సంఘాల తరఫున ఆయనకు గౌరవ స్థానం ఉందని తెలిపారు. గడిచిన కాలంలో అనేక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో సత్యం కీలక పాత్ర పోషించారని ఆయన అన్నారు. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల,దళిత నమ్మకం నిలబెట్టాలనీ కోరారు. ప్రభుత్వ పథకాలపై నిబద్ధతతో పర్యవేక్షణ జరపగల వ్యక్తి నెలకుంటి సత్యం అన్నారు. ఆయనకు మంత్రి పదవి రాజకీయాలలో సాధించిన స్థానం కేవలం వ్యక్తిగత కృషి ఫలితం అవుతుందన్నారు. ఇలాంటి నాయకులకు గౌరవప్రదమైన స్థానాలు కల్పించడం సమాజానికి, రాష్ట్రానికి మేలును చేకూరుస్తుంది అని అభిప్రాయపడ్డారు. రాబోయే మంత్రి వర్గ విస్తరణలో ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యాన్ని మంత్రి పదవికి నియమించాలని ఆకాంక్షించారు.

# భగత్ సింగ్ ఆశయ సాధన కోసం డివైఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తుంది

## – డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు బొడ్డుపల్లి నరేష్




మునుగోడు, మేజర్‌న్యూస్ : భగత్ సింగ్ ఆశయ సాధన కోసం డివైఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తుందనీ డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు బొడ్డుపల్లి నరేష్ అన్నారు. శనివారం భారత స్వాతంత్ర సమరయోధుడు షాహిద్ భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇంక్విలాబ్ జిందాబాద్" నినాదంతో తన 23 సంవత్సరాల అతి చిన్న వయసులో ఉరి కంబాన్ని ముద్దాడిన వీర యోధుడు భగత్ సింగ్ అని ఆయన సేవలను కొనియాడారు. చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచి పోయాడని, దేశానికి స్వాతంత్రం రావడం కోసం అందరూ సమానంగా బ్రతికే నవ సమాజం రావాలని కలలుగన్నారన్నారు. ఆయన ఇచ్చిన నినాద స్ఫూర్తితో ఆయన కలలుగన్న నవ సమాజం కోసం నేటి యువత నడుంబిగించాల్సిన అవసరం ఉందన్నారు. యువజన, విద్యా వ్యతిరేక విధానాలపై డివైఎఫ్ఐ గా సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని, అలా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే భగత్ సింగ్ కి మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. భగత్ సింగ్ కి భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు యాట శ్రీకాంత్, ధనుంజయ్, సుస్మిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

## మాజీ యంపిటిసి పోలగోని విజయలక్ష్మి సైదులు గౌడ్

మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని ఊకోండి గ్రామానికి చెందిన కోణం జగాలు (70),పోగుల సుభాష్ (40), మేడి యాదగిరి (35) ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన శనివారం మృతుల కుటుంబాల సభ్యులను పరామర్శించి మూడు కుటుంబాలకు 5,000 రూపాయల చొప్పున మొత్తం రూ. 15,000 రూపాయల ఆర్థిక సహాయంను అందజేసి మానవత్వం



చాటుకున్నారు. విషయం తెలుసుకొని ఆర్థిక సహాయంను అందజేసిన ఆయనకు మృతుల కుటుంబాల కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో యాగ్రమాద వెంకన్న, జాల లింగయ్య, మేడి చంద్ర స్వామి,దొడ్డి రవి,గంధం లింగస్వామి,చందపాక వెంకులు, బోయిపల్లి ధశరథ, మేడి అశోక్, జాల సురేష్,చందపాక రామక్రిష్ణ,దోడ్డి నాగారాజు,చందపాక శ్రీను,గురిజాల శ్రావణ్, పోగుల యాదగిరి,చందపాక అనిల్, సిద్ధగోని మధు, దొడ్డి భద్రయ్య, మేడి నర్సింహా, మేడి అంబేద్కర్,గాదే లోకేష్, చందపాక అశోక్,చందపాక లింగయ్య,పోగుల కాశయ్య, బోయపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా మహిళలకు లాటరీ పద్ధతిలో వార్డు సభ్యుల స్థానాలు

## ఎంపీడీవో గంగుల యుగంధర్ రెడ్డి



మునుగోడు, మేజర్‌న్యూస్ : పారదర్శకంగా మహిళా స్థానాలకు లాటరీ పద్ధతిలో వార్డు సభ్యుల స్థానాలు ఎంపిక చేశామని మునుగోడు ఎంపీడీవో గంగుల యుగంధర్ రెడ్డి తెలిపారు. శనివారం తెలంగాణ రాష్ట్ర 2వ సాధారణ ఎన్నికల కోసం మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో మహిళా అభ్యర్థుల కోసం కేటాయించిన వార్డు సభ్యుల స్థానాలను లాటరీ పద్ధతిలో నిర్ణయించారు. ప్రభుత్వం నిర్దేశించిన రిజర్వేషన్ విధానం ప్రకారం మహిళలకు కేటాయించిన స్థానాలను ఖరారు చేయడానికి ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో అధికారులు లాటరీ డ్రా చేపట్టారు. మాజీ ప్రజా ప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నేతలు లాటరీ డ్రాను సమీక్షించారు. అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించిన ఈ ప్రక్రియలో ఏ వార్డులు మహిళలకు రిజర్వ్ అయ్యాయో తేల్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు పెంబల జానయ్య, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,గురుజ రామచంద్రం, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మారగొని అంజయ్య ,మేకల శ్రీనివాస్ రెడ్డి, ఆనగంటి కృష్ణ, గాదేపాక అంజయ్య, మాదగోని రుషికేశ్ గౌడ్ కర్నాటి లింగయ్య,జిట్టగోని వెంకన్న, ఉప్పునూతల రమేష్, ఏడవల్లి సురేష్ కుమార్,పంచాయతీ కార్యదర్శులు పజ్జూరి జానకిరాములు, సోమనబోయిన శ్రీనివాస్,వెంకటేష్, ఎంసీఓ శరత్ తది తరులు పాల్గొన్నారు.

# నూతన పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన దేవరకొండ ఎమ్మెల్యే

చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి మండలంలోని మదనాపురం స్టేజ్ వద్ద శ్రీ బాలాజీ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ను ప్రారంభించి, బంక్ యాజమాన్యానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్. బాలు నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను వినియోగదారులకు అందించాలని నిర్వాహకులు వాంకుడోత్ శక్రు నాయక్‌కు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వాంకుడోత్. శకృ నాయక్ కుటుంబ సభ్యులు,ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# వ్యవసాయ సహకార సంఘ అభివృద్ధికి కృషి

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి



భూధాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అభివృద్ధికి కృషి చేశామని చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి అన్నారు. భూధాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో శనివారము ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అర్థ వార్షిక మహాసభ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రబీ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మూడు లక్షల 60 వేల క్వింటాల్లో ధాన్యం కొనుగోలు చేసి జిల్లాలోనే ప్రథమ స్థానం గా నిలిచామని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా నూతనంగా షెడ్లను నిర్మాణం చేసి అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గత ఐదున్నర సంవత్సరాలుగా ఏర్పడిన కమిటీతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ సహకార సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లామని వారు తెలిపారు .ఇందులో భాగంగా సొంత నిధులతో ప్రహరీ గోడ ,గోదాము 50 లక్షల నిధులతో నిర్మించుకొని సంస్థ అభివృద్ధిలో ముందున్నామని ఆయన తెలిపారు .ప్రతి రైతుకు రుణాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో రుణాలు అందించామని ఆయన తెలిపారు. సంస్థ అభివృద్ధి కోసం కమిటీ సభ్యుల సహకారంతో రైతుల సహకారంతో తన పదవీకాలం సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సామమోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మద్ది అంజిరెడ్డి, సీఈవో సద్దిపల్లి బాల్ రెడ్డి, డైరెక్టర్లు మద్ది చంద్రారెడ్డి, నల్ల కిష్టమ్మ,రామస్వామిచంద్రశేఖర్ రెడ్డి, సిద్ధ గొని రాజ మల్లేష్ గౌడ్, మహిళ గణేష్, ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, కుసుకుంట్ల అలివేలు మంగ కొండల్ రెడ్డి, ఎడ్ల సహదేవ్, కంబాలపల్లి సత్తయ్య యాదవ్, గుర్రం నర్సిరెడ్డి, సిబ్బంది శ్రీధర్ ,నాని, ఇబ్రహీం, రైతులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ కళాశాలలో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు





కోదాడ, మేజర్‌న్యూస్ : బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో, అనంతగిరి మండలంలో ఉన్న అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో వందలాది మంది విద్యార్థులు బతుకమ్మ పాటలతో ఆడుతూ చేసిన సంబరాలు అంబరాన్ని అంటాయి. రెండు కళాశాలలోనూ ఆయా యాజమాన్యాల ఆధ్వర్యంలో సాంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ తల్లికి పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడుతూ పాడుతూ సంబరాలు నిర్వహించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న ఉత్సవాల్లోనూ, మహిళలు భారీగా పాల్గొన్నారు.

### అభియాన్, దివ్యాంగ జన అభివృద్ధి పథకాన్ని

# దివాంగులు సద్వినియోగం చేసుకోవాలి

## బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి



కోదాడ, మేజర్‌న్యూస్ : ప్రధానమంత్రి నరేంద్ర మోది జన్మదినాన్ని పురస్కరించుకొని, సేవా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం కోదాడ పట్టణంలో ఉన్నతేజ పాఠశాలలో దివ్యాంగుల కు సన్మాన కార్యక్రమం బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి హాజరై, దివ్యాంగులకు శాలువ కప్పి సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మానవత్వం అంటే ప్రతి ఒక్కరిని సమానంగా చూడటమని, మోదీ ఎల్లప్పుడూ దివ్యాంగులను, వికలాంగులు అని కాకుండా, ప్రత్యేకమైన శక్తులు కలిగిన వారు అని గౌరవంగా 'దివ్యాంగులు' అని సంబోధిస్తారని అన్నారు.వారిలో ఉన్న ప్రతిభకు వేదిక కల్పించేందుకు, స్వావలంబనతో జీవించేందుకు కేంద్ర ప్రభుత్వం సుగమ్య భారత్ అభియాన్, దివ్యాంగ జన అభివృద్ధి పథకం ప్రవేశపెట్టాలని అన్నారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, పింఛన్ సౌకర్యాలు, ప్రత్యేక శిక్షణా కేంద్రాలు, స్వావలంబన్ పథకం లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, బీజేపీ ఎల్లప్పుడూ విద్య, వైద్యం, వెల్ఫేర్ రంగాలలో పేదల కోసం, దివ్యాంగుల కోసం అండగా ఉంటుందని అన్నారు.ఇ కార్యక్రమంలో సేవా పక్వాడ జిల్లా కన్వీనర్ వంగవీటి శ్రీనివాస్ రావు, కోకన్వీనర్ జిల్లా జనార్ధన్, కోదాడ పట్టణ అధ్యక్షులు గోదేశి లక్ష్మణ్, బిజెపి సీనియర్ నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, కనగల నారాయణ, ఓరుగంటి పురుషోత్తం, చిల్కూరు శ్రీనివాస్,విజయ భాస్కర్ రెడ్డి, సుంకర లింగారెడ్డి, కాటూరి శేషగిరి, శోభా, పాపయ్య గౌడ్, వంగాల పిచ్చయ్య దేవునూరి లక్ష్మి, దివ్యాంగులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### మూసీ అలర్ట్..

# మూసీకి పెరుగుతున్న నీటి ప్రవాహం

(మొదటిపేజీ తరువాయి)

వర్షం పడితే మూసీ గేట్లు పదిలమేనా..లేక కొట్టుకుపోయే ప్రమాదముందాని పరివాహక ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

**అలర్ట్ చేసిన మూసీ, పోలీసు అ“దికారులు**

మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను జిల్లా ఎస్పీ నరసింహ, మూసీ అ‘దికారులు అప్రమత్తం చేస్తున్నారు. మూసీ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి ప్రవాహం ఉదతంగా ప్రవహిస్తుండడంతో బీమారం, మూసీ ప్రాంతాలను జిల్లా ఎస్పీ నరసింహతో పాటుగా మూసీ అ‘దికారులు పరిశీలించారు. అంతేకుండా మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు ఆ వైపుగా వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

***మూసీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : నరసింహ, ఎస్పీ***

మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మూసీ నదిలోకి ఎవరు కూడా దిగొద్దు. ఉదతంగా ప్రవహిస్తున్న కల్వర్టులు,బ్రిడ్జిలు, వాగులు దాటొద్దు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు విద్యుత్‌తీగలు, నీటి ప్రవాహం నుంచి జాగ్రత్తగా ఉండాలి.

# గంజాయి మత్తులో హత్యలు

(మొదటిపేజీ తరువాయి)

కోసం సూర్యాపేట డీఎస్పీ ఆ‘ద్వర్యంలో రూరల్ సీఐ, ఎస్ఐలు బందాలుగా ఏర్పడిగాలింపు చర్యలు చేపట్టారు. సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటుగా కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి, మఠంపల్లి, మేళ్లచెరువు, తుంగతుర్తి మండల కేంద్రాల్లో సైతం గంజాయి పురివిప్పింది. గంజాయి కట్టడికి పోలీసు యంత్రాంగం కట్టడి చేసినప్పటికీ పట్టణాలతో పాటుగా ఏకంగా గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమవుతున్న పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కోదాడ పట్టణంలో వందల కిలోల గంజాయి ్యగులను గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. అలాగే సూర్యాపేట పట్టణంలో ని పలు ప్రాంతాల్లో గంజాయి విరివిగా లభిస్తుంది.

***చుట్టుముట్టిన గంజాయి..***

గంజాయికేసులు నమోదవతున్న పోలీసులు ఏ మాత్రం కట్టడి చేయలేకపోతున్నారు. ప్ర‘దానంగా వచ్చే రహదారులపై సరైన నిఘా లేకపోవడంతో పట్టణ , మండల కేంద్రాలకు గంజాయి చేరుతుంది. దీంతో చిన్న చిన్న ప్యాకెట్లలో చేసి విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం గంజాయి లభించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు గంజాయి కి ‘‘నిసై తల్లిదండ్రులపై దాడుగలకు దిగుతున్నారు.

***మత్తులో దాడులు..వీరంగం***

గంజాయి మత్తులో యువకులు ఎవరిని ఎందుకు కొడుతున్నారో కూడా అర్థం కాకుండా దాడులకు మారణాయు‘దాలతో కొట్టి గాయాలపాలు చేస్తున్నారు. పది మంది కలిసి గంజాయి సేవించడంతో ఎదురువచ్చిన వాళ్లతో ఘర్షణకు దిగి దాడులకు తెగపడుతున్నారు. ఒకానొక దశలో పోలీసులు కూడా మందలించే పరిస్థితి లేకుండా పోయిందంటే గంజాయి ఏ స్థాయిలో చుట్టుముట్టిందో అర్థం అయిపోతుంది.

***గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం : నరసింహ, ఎస్పీ***

జిల్లాలో గంజాయిని సమూలంగా లేకుండా చేస్తున్నాం. ఎక్కడ లభించినా.. విక్రయించినా.. సేవించినా కేసులు నమోదు చేయడంతో పాటుగా కౌన్సిలింగ్‌లు ఇస్తున్నాం. విద్యార్థులు ముఖ్యంగా గంజాయికి ‘‘నిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. గంజాయి విక్రయించినా.. సరఫరా చేసినా పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# రిజర్వేషన్లతో ఆశావాహుల ఆశలు గల్లంతు

## జనం కోసం, ఓటర్ల కోసం ఇన్నాళ్లు ఖర్చుపెట్టిందంతా వృథా అంటూ ఆవేదన



కోదాడ, మేజర్‌న్యూస్ : స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు జీవో ప్రకారం ఖరారు చేసిన రిజర్వేషన్లతో ఆశావాహుల ఆశలు గల్లంతయ్యాయి. స్థానిక సంస్థల పదవీకాలం పూర్తయిన నాటి నుండి నేటి వరకు సర్పంచ్లుగా, ఎంపీటీసీలుగా, ఎంపీపీలుగా, జడ్పీటీసీలుగా కావాలనుకున్న జనరల్ నాయకులు సంవత్సర కాలానికి పైనుండి ఓటర్లను,ప్రజలను మంచిగా చేసుకునేందుకు అమ్మ, అయ్య, అక్క, తమ్ముడు అంటూ వారు అడిగిన కోరికల ను తీరుస్తూ డబ్బులు ఖర్చు చేశారు. తీరా ఇప్పుడు వచ్చిన రిజర్వేషన్లతో వారు తీవ్ర నిరాశకు గురై ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా కోదాడ నియోజకవర్గంలోని ప్రధానంగా ఎంపీపీలు, జెడ్పీటీసీలు గా, ప్రధాన గ్రామాలలో సర్పంచులుగా పోటీ చేయాలనుకున్నవారు ఏమి చేయాలో పాలు పోక సందిగ్ధంలో పడ్డట్టుగా పలువురు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గం లోఎక్కువ చోట్ల పాత కొత్త నాయకులతో పోటీ తీవ్రంగా ఉన్న చోట రిజర్వేషన్లు తారుమారు కావడంతో అన్ని పార్టీల పెద్దలకు తలనొప్పి తప్పినట్లుగా పలువు చర్చించుకుంటున్నారు. కాగా ఊహించని విధంగా ఎస్సీలకు,ఎస్టీలకు మహిళలకు,బీసీలకు రిజర్వేషన్ల స్థానాలు అధిక సంఖ్యలో రావటంతో వారిలో ఉత్సాహం కనపడుతుంది. అప్పుడే గ్రామాలలో రిజర్వేషన్ ప్రకారం కాస్త పట్టు ఉన్న వారు టికెట్ల కోసం ఆయా పార్టీల ద్వితీయశ్రేణి నాయకుల మెప్పుకోసం ప్రయత్నాలు మొదలుపెట్టే పనిలో నిమగ్నమైనట్టు సమాచారం. ఉమ్మడి జిల్లాలో జిల్లా పరిషత్తు చైర్మన్ ల విషయంలోనూ రిజర్వేషన్లతో ఆశావాహులు తలకాయలు పట్టుకుంటున్నారు.

# నార్ముల్ డైరెక్టర్‌గా కర్నాటి జయశ్రీ

చిట్యాల, మేజర్‌న్యూస్ : నల్లగొండ రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సహాయ సహకార సంఘం డైరెక్టర్‌గా చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన కర్నాటి జయశ్రీ ఉప్పల వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. నార్ముల్ డైరెక్టర్ పదవి కోసం శనివారం నిర్వహించిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున జయశ్రీ పోటీ చేసి గెలుపొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సమస్యల ను పరిష్కరించి, నార్ముల్ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ లలితా పరమేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు



కోదాడ, మేజర్‌న్యూస్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో, నయా నగర్, జ్యోతి అపార్ట్మెంట్ వద్ద దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారు భక్తులకు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి రూపంలో దర్శనం ఇచ్చారు. వేద పండితులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శరన్నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని దాతలు, ఆలయ కమిటీ సభ్యులు కలిసి ప్రారంభించారు. అదేవిధంగా రామాలయంలో జరిగిన అమ్మవారి పూజలు టిసిసి డెలికేట్ నెంబర్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్యబాబు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదానాన్ని లక్ష్మీనారాయణ రెడ్డి, వంగవీటి రామారావు లు ప్రారంభించారు. అదేవిధంగా బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి, పార్టీ నాయకులు వంగవీటి శ్రీనివాసరావు బొలిసేటి కృష్ణయ్య తోపాటు పలువురు అమ్మవారి పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు తెలిపారు.

***యాదగిరి కొండ :*** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం



అనుబంధ ఆలయమైన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా ఆరవ రోజు అమ్మవారు శ్రీ పర్వత వర్ధినిలి దేవీగా భక్తులకు దర్శనం, శనివారం రోజు ఉదయం ప్రాతఃకాల పూజ అర్చనలు పారాయణాలు శ్రీదేవీ మూల మంత్ర జపం మధ్యాహ్నం శ్రీదేవీ చతుషష్టి ఉపచార పూజ నీరాజన మంత్ర పుష్పములు తీర్థప్రసాద వినియోగం జరిగినాయి. సాయంకాలం 7నుండి నవావరణ పూజ చతుషష్టి ఉపచార పూజ సహస్రనామార్చనలు మంత్రపుష్పములు తీర్థప్రసాద వినియోగం జరిగినాయి ఇట్టి కార్యక్రమంలో అర్చకులు పురోహితులు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

***హాలియా :*** హాలియా మున్సిపాలిటీ ఆరో వార్డు బొడ్రాయి బజారు నందు నవగణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి ,మండల పార్టీ అధ్యక్షులు కుందూరు వెంకట్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు కాకునూరి నారాయణ, మాజీ నల్గొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గౌని రాజారమేష్ యాదవ్, ఎస్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు పాండు నాయక్,నిమ్మల జనార్దన్ రెడ్డి, వర్కల సుధాకర్ రెడ్డి, పొదిల కృష్ణ మరియు కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



***చింతపల్లి :*** మాల్ మార్కెట్ లోని శ్రీ గాయత్రి పీఠం మాల్ వారి ఆధ్వర్యంలో



ఏర్పాటుచేసిన దుర్గామాత మహాకాళి అవతారంలో దర్శనమిచ్చారు.. శనివారము శుద్ధ షష్టి అనురాధ నక్షత్రం సందర్భంగా మహాకాళిగా అలంకరించారు. శ్రీ గాయత్రి పీఠం వ్యవస్థాపకులు క్రోవిడి సత్య సాయిబాబా శాస్త్రి, కుటుంబ సభ్యులు, భక్తులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా చింతపల్లి మండలం వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద దుర్గ మాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గోడకొండ్ల గ్రామంలోని సిద్ధి వినాయక యూత్, రచ్చబండ దగ్గర, సాయిబాబా దేవాలయం పక్కన, మాల్ మార్కెట్ లోని త్రిశక్తి యూత్ అసోసియేషన్, చాకలి షేరిపెల్లి గ్రామం, ఉమ్మాపురం, తక్కల పెల్లి, కురుమేడు, కురుమపెల్లి, వెంకటంపేట, చింతపల్లి మండల కేంద్రంలోని దుర్గామాత మండపాల వద్ద పూజలు భక్తులు ఘనంగా నిర్వహించారు. మాల్ మార్కెట్ లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలు,దుర్గామాతకు పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఊరే లక్ష్మణ్ శ్రీదేవి దంపతులు, వ్యాపారస్తులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

# ఫిర్యాదులు విన్నా చర్యలు లేవు

## - సాయి గూడెం గ్రామంలో రహదారి సమస్య
## - ప్రజలకు నడవడానికి కూడా వీలులేని పరిస్థితి



ఆలేరు, మేజర్‌న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల పరిధిలోని సాయిగూడెంలో అంబేద్కర్ చౌరస్తా నుండి ట్రాన్స్ఫారం వరకు ఉన్న రహదారి ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిని బురదమయంగా మారిపోయింది.వర్షం పడిన ప్రతిసారి రహదారిపై నీరు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ప్రజలు ఆ రహదారిపై నడవడమే గాక,వాహనాలతో ప్రయాణించడం కూడా అసాధ్యమైపోతోంది.ప్రత్యేకంగా గ్రామంలో ఉన్న చర్చి వైపు వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ప్రతిరోజూ వృద్ధులు,పిల్లలు,మహిళలు ఆ మార్గంలో రాకపోకలు చేస్తుంటారు.కానీ రహదారి దయనీయ స్థితిలో ఉండడంతో వారు జారిపడే ప్రమాదం,బురదలో కూరుకుపోయే సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొన్ని సార్లు అత్యవసర పనుల కోసం వెళ్లాల్సిన సందర్భాల్లో కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

***అధికారుల నిర్లక్ష్యం***

గ్రామస్థులు పలుమార్లు ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదులు చేశారు.అయితే అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా సమస్యను పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గ్రామ ప్రజలు ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారులు తక్షణమే ముందుకు రావాలని కోరుతున్నారు.రహదారి మరమ్మతులు చేసి,వర్షపు నీరు సులభంగా పోయే విధంగా డ్రైనేజీ లేదా సైడ్ కాల్వలు ఏర్పాటు చేయాలనీ,చర్చి వైపు వెళ్లే ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా,నడక దారి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

***మాకు న్యాయం చేయాలి" : గ్రామస్థుల విజ్ఞప్తి***

"ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.ఈ రహదారి పరిస్థితి వల్ల మా పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు.చర్చి నుంచి వచ్చే వృద్ధులు నడవలేకపోతున్నారు.మేమ అధికారులను కోరేది ఒక్కటే. వెంటనే చర్యలు తీసుకోవాలి" అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామంలో ఉన్న ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటే ప్రజలకు ఊరట లభిస్తుంది.లేనిపక్షంలో ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగే అవకాశం ఉందని గ్రామ పెద్దలు హెచ్చరిస్తున్నారు.

# సాంకేతిక విద్యకు ప్రభుత్వం పెద్దపీట

## అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించిన బీర్ల అయిలయ్య

ఆలేరు, మేజర్‌న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక పారిశ్రామిక శిక్షణ సంస్థ ఐ.టి.ఐ లో నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏ.టి.సి) ను శనివారం నాడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా ప్రారంభించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హైదరాబాదులో వర్చువల్‌గా ఏ.టి.సి లను ప్రారంభించిన కార్యక్రమంలో భాగంగా ఆలేరులో ఎమ్మెల్యే ఐలయ్య ఏ.టి.సిను ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ముందుగా సెంటర్ ప్రారంభించిన అనంతరం,ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఏ.టి.సి లోని ఆధునిక సాంకేతిక పరికరాలను పరిశీలించారు.టెక్నికల్ ఇన్స్ట్రక్టర్లు యంత్రాల పనితీరు, శిక్షణ విధానం గురించి వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐ.టి.ఐ లను ఆధునిక సాంకేతిక సెంటర్లుగా మార్చి గ్రామీణ యువతకు ఆధునిక శిక్షణ అందించటం ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు.ఏ.టి.సి లో శిక్షణ పొందిన యువత నేషనల్ మరియు మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు పొందగలరని ఆయన తెలిపారు.40 కోట్ల రూపాయలతో ఏర్పాటుచేసిన ఈ సెంటర్‌లో విద్యార్థులు ఆధునిక సాంకేతిక కోర్సుల్లో ఏడాది లేదా రెండు సంవత్సరాలపాటు శిక్షణ పొందగలరు.సాంకేతిక విద్యాభివృద్ధి ద్వారా యువత భవిష్యత్తులో స్వయం ఉపాధి,పరిశ్రమల్లో వృత్తి అవకాశాలు పొందగలదని ఎమ్మెల్యే వివరించారు.ఐ.టి.ఐ కళాశాల ప్రిన్సిపాల్ బి.హరికృష్ణ మాట్లాడుతూ ఏ.టి.సి లో విద్యార్థులు శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.భవిష్యత్తులో ఏ.టి.సి ని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్గా అభివృద్ధి చేయాలని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యేను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు,రాష్ట్ర మహిళా కో-ఆపరేటివ్ అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్య రెడ్డి,టి.పీ.ఐ.సి.సి.సి.ఐ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి,ఆలేరు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ.ఏజాస్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. స్థానికులు ఈ సెంటర్ ప్రారంభం ద్వారా యువతకు ఆధునిక సాంకేతిక శిక్షణ, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయని, భవిష్యత్తులో ఇది పెద్ద స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# కొలనుపాకలో కులాంతర సమాజం కోసం సదస్సు

ఆలేరు, మేజర్‌న్యూస్ : ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో సత్యశోధక్ సమాజ్ 153వ వార్షికోత్సవం సందర్భంగా కుల నిర్మూలన ఆచరణాత్మక సదస్సు నిర్వహించబడింది.ఈ సదస్సుకు ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం నాగరాజ్ అధ్యక్షత వహించారు.అఖిలభారత రైతుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ద్వారా అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి,ఐక్యతకు మద్దతు లభించిందని కొనియాడారు.మహిళలకు విద్య అందించడం కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషిని కూడా ప్రశంసించారు.బిక్షపతి ప్రస్తుత ప్రభుత్వాలు కులాల మధ్య విభేదాలు సృష్టిస్తున్నాయని,సమాజంలో చట్టబద్ధమైన ఐక్యత కోసం ప్రజలు సంఘటితంగా ఉద్యమించాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టి యు జిల్లా నాయకులు,ఏఐకేఎంఎస్,మహిళా సంఘం,పిడిఎస్‌యు,సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

ఆలేరు, మేజర్‌న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సంబరాలు స్థానిక సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ, మహిళలు, యువత,పెద్దలందరూ ఉత్సాహంగా పాల్గొని,బతుకమ్మ పూలతో అలంకరించి అనంతరం మహిళలు అందరూ బతుకమ్మను ఆడిపాడారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్,ఎంపీఓ అనురాధ దేవి,ఏపీఓ అరుణ కుమారి,టెక్నికల్ అసిస్టెంట్ మానస,వై.రామచంద్రయ్య చారి,కంప్యూటర్ ఆపరేటర్లు లక్ష్మి సరళ,కళ్యాణి,ఐకేపీ సిబ్బంది, ఇతర స్థానికులు పాల్గొన్నారు.

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



నార్కెట్‌పల్లి, మేజర్‌న్యూస్ ః నార్కెట్‌పల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ ఆవరణలో నార్కెట్‌పల్లి గ్రామ పంచాయితీ కార్యదర్శి శుభానుద్దీన్ ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ 110 జయంతి సందర్భంగా ముఖ్యఅతిధిగా నార్కెట్‌పల్లి పట్టణ పద్మశాలి అధ్యక్షుడు గర్దాస్ వెంకటేశ్వర్లు విచ్చేసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు తరాలపాటు తెలంగాణ సాధన కోసం నిరంతరం పోరాటం చేసిన మన ఉద్యమ యోధులు మహనీయుని జయంతి వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని అట్టడుగు వర్గాల సేవ సభండ వర్గాల సాధికారత సామూహిక తెలంగాణ సాధనలో కృషి చేసిన నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్కెట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి వెంకటేశ్వర్లు యాదవ్, శ్యామల చంద్రమౌళి నేత, మిర్యాల నగేష్ నేత, సుంకి శ్రీనివాస్ నేత, పిరికిపండ్ల స్వామినేత, కర్నాటి శ్రీరంగం నేత తదితరులు పాల్గొన్నారు.

**నార్కెట్‌పల్లి :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110 జయంతిని శనివారం



బ్రాహ్మణవెల్లంల గ్రామంలో స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పద్మశాలి సంగం సహాయ కార్యదర్శి చెరుపల్లి గోపాలకృష్ణ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం మండల పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు చెరుకుపల్లి రఘుపతి నేత అనాధ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులు చెరుపల్లి పరమేశం, పెండెం వెంకటేశం, గరదాసు వెంకటేశ్వర్లు, బ్రాహ్మణవెల్లంల పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**కోదాడ :** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను సాధించాలని టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. శనివారం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి సందర్భంగా కోదాడ పట్టణంలో ప్రధాన రహదారిపై ఉన్న ఆయన విగ్రహానికి అన్ని పార్టీల నాయకులు పద్మశాలి సేవా సంఘం సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన అలుపెరగని పోరాటం చేశారని ఆయన సేవలను కొనియాడారు. నేడు యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని వారు చూపిన బాటలో నడవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైడిమరి సత్తిబాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

**బారాస ఆధ్వర్యంలో...**



బారాస పట్టణ అధ్యక్షుడు ఎస్.కె నయీామ్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారిపై ఉన్న కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఎస్‌కే నయీామ్ తో పాటు సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్యబాబు మరియు పార్టీ నాయకులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

**యాదగిరి గుట్ట :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి సందర్భంగా





శ్రీ ధరణి మల్టీ స్పెషాలిటీ సహకారంతో యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో అఖిలభారత పద్మశాలి అన్న సత్రం ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. సత్రం ఉపాధ్యక్షులు చుంచు నాగ భూషణం బాపూజీ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు .ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేశారు 97 కులాలకు ప్రాతినిధ్యం కల్పించారనీ వారిని ఆదర్శంగా తీసుకోవాలి అని రచ్చ శ్రీనివాస్ అన్నారు. కోశాదికారి బడుగు మల్లేశం ఈ కార్యక్రమంలో బిపి, షుగర్ టెస్టులు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇవ్వడం జరిగింది. శ్రీ ధరణి హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ రేవంత్ జనరల్ సర్జన్, డాక్టర్ రాకేష్ గౌడ్ జనరల్ ఫిజీషియన్, డాక్టర్ స్రవంతి గైనకాలజిస్ట్ ,డాక్టర్ జగదీష్ బాబు ఆర్థోపెడిక్, డాక్టర్ రమేష్ ,హాస్పిటల్ ఎండి శ్రీకర్ అండ్ శ్రీలక్ష్మి, సీఈఓ మద్దెల కరుణాకర్, సహాయ కార్యదర్శి గుజ్జ బలరాం, పట్టణ సంఘం అధ్యక్షుడు ఎర్ర గంట వెంకటేష్, గంజి సూర్య నారాయణ, కోడూరి రాజు, ధర్మకర్తలు గుజ్జ నిర్మల, అంకం నరసింహ,పులగం భిక్షపతి, కైరంకొండ మధు, పులగం కైలాసం, బొమ్మ సూర్య నారాయణ, మిరియాల లక్ష్మి, ఎర్రగుంట్ల శేఖర్, మెరుగు మధు, రచ్చ లక్ష్మి బాయి, గొర్ల జ్యోతి, మెరుగు కిష్టయ్య, హేమలత ,భాగ్య లక్ష్మి, గురం వసంత,రవి, మహేష్, నరేందర్ శంకర్ ,స్వాతి,సంతోష సత్రం మేనేజర్ పాండు రంగం, డాక్టర్ అంబటి చెన్న కిష్టయ్య స్థానిక ప్రజలు ధర్మకర్తలు పాల్గొన్నారు.

**చిట్యాల :** ఉద్యమాలే జీవితంగా బతికి తన సర్వస్వాన్నీ ప్రజల కోసం దార పోసిన



ధీశాలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని శాసనమండలి మాజీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. శనివారం చిట్యాల పట్టణ కేంద్రంలో గ్రీన్ గ్రోవ్ హైస్కూల్ లో భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలోమాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర వహించారని,తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడారని, చాకలి ఐలమ్మ పై పెట్టిన కేసులను సాయుధ పోరాటంలో జైలు పాలైన వారందరి కేసులపై న్యాయవాదిగా పనిచేశారని, వెట్టి చాకిరి నిర్మూలన కోసం చేసిన పోరాటంలో పాల్గొన్నారని తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించి రాజకీయ నాయకుడిగా రాజనీతిజ్ఞుడుగా విశేష కీర్తి పొంది చరిత్ర పుటల్లో ఎక్కిన ప్రజ్ఞాశాలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని పేర్కొన్నారు.తెలంగాణ కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకోవడమే కాకుండా తెలంగాణ వచ్చేవరకు ఏ ఒక్క పదవిని తీసుకోనని చెప్పి ఆచరించిన మహా నిష్టాగరిష్టుడు బాపూజీ అని పేదలపై పెత్తందారి అరాచకాలకు వ్యతిరేకంగా శ్రమించారని, ఆయన చేసిన ప్రధాన సేవల్లో చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేయడం పని కల్పించడం వలసలు నివారించటం చేశారని అనేక వృత్తి సంఘాలను ఏర్పాటు చేసి సహకార సంఘాలను అభివృద్ధి చేశారని 96 సంవత్సరాల వయస్సులో ఢిల్లీలో నిరాహార దీక్ష చేశారని రాజకీయ నిబద్ధత సేవలో నిబద్ధత మాటల్లో నిబద్ధత ఆచరణలో నిబద్ధత కలిగి ఉన్న ఏకైక వ్యక్తి అని భారత్ చైనా యుద్ధంలో గాయపడిన సైనికులకు ఆయన సతీమణి డాక్టర్ గా సేవలందించారని కొండా లక్ష్మణ్ బాపూజీని కులం వరకు పరిమితం చేయడం మంచిది కాదని ఆయన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని ఆయన జయంతిని అన్ని వర్గాల వారు ఆయన చేసిన సేవలను స్మరించుకోవాలని చిన్న కొండూరు ఎమ్మెల్యేగా పనిచేసిన కొండా లక్ష్మణ్ మన జిల్లాతో ఎక్కువ సంబంధాలు కలిగి ఉన్నాడని తెలంగాణ చరిత్రలో ఆయన పేరు శాశ్వతమని స్వచ్ఛమైన రాజకీయాలకు ప్రతిరూపమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జెల్లా మనోహర్ ,ప్రధాన కార్యదర్శి గంజి వెంకటేశం, కోశాధికారి కుకుడాల గోవర్ధన్, గౌరవ సలహాదారులు జెల్లా సత్తయ్య, గంజి అంజయ్య, కృష్ణయ్య,మిర్యాల ప్రకాష్, సంగిశెట్టి మనోహర్, సదానందం, సూరెపల్లి సత్యనారాయణ ,గుర్రం బిక్షపతి, తడక మురళీధర్, పిల్లల మర్రి కృష్ణ ,గండూరి రమేష్, రచ్చ దామోదర్, గుజ్జరి యాదగిరి, మిర్యాల గోవర్ధన్, గంజి యాదగిరి ,తాటి సాయి వర్ధన్, భాస్కర్, పెండెం చండీకేశ్వర్,గండూరి భానుకృష్ణ,గండూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**బీబీనగర్ :** ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను మండలకేంద్రంలోని రహదారి బంగ్లలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు వోవాల్దస్ శివయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంత్రి బాలరాజు, వోవాల్దాస్ వీరస్వామి,వంగరి బద్రేశం, అమృతం శివకుమార్, వంగరి పరాంకుశం, సతీష్, కోట సత్తయ్య, వోవాల్దాస్ కొండల్, వెంకటేష్, శంకర్, హరికృష్ణ, శ్రీనివాస్, నారాయణ, వెంకటేష్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు పిట్టల అశోక్, మైసయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**హాలియా :** హాలియా సెంటర్లో గాంధీ స్టాచ్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుందూరువెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు పార్లమెంట్ సభ్యులు కుందూరు కుందూరు రఘువీర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్, కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాలను సమర్పించి అనంతరం గౌరవ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ అనే వారు మూడు తరాల ఉద్యమ వారధిగా, స్వాతంత్ర్య పోరాటం నుండి మలితర ఉద్యమం వరకు సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆయన దోపిడీ రహిత సమాజం,కుల ఆధార వ్యత్యాసాలు లేనివి,ప్రాంతీయ అసమానతలు లేని ప్రజాస్వామ్యం,పీడిత బలహీనుల పక్షం,ప్రత్యేక తెలంగాణ సాధన కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు అని కొనియాడారు, ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు కాకునూరి నారాయణ గౌడ్, నిడమానూరు మార్కెట్ కమిటీ అధ్యక్షులు అంకతి సత్యం, మిట్టపల్లి వాసులు, గౌని రాజా రమేష్ యాదవ్, కుందూరు రాజేందర్ రెడ్డి, జూపల్లి శ్రీనివాస్, రావుల రాంబాబు,వెంపటి శ్రీనివాస్, సభావాత్ పాండు నాయక్, చెరుపల్లి ముత్యాలు, ఉంగరాల శ్రీను , మహమ్మద్ మజారుద్దీన్ నకరే కంటి సైదులు, గడ్డం రమణయ్య, నామని సుధాకర్, కోట నాగిరెడ్డి, గద్దె నాగరాజు, పొదిల కృష్ణ ఎస్కే అన్వర్, పోషం వెంకట్రెడ్డి, అలుగుల రమణారెడ్డి, వర్కాల శ్రీనివాస్ రెడ్డి, ఎడవల్లి సోమశేఖర్,సర్దార్ నాయక్, కందుల మదన్ రెడ్డి కొంగరి శ్రీనివాసు, గడ్డం కృష్ణయ్య, ఐటి పాముల శ్రీనివాస్, గడ్డం లింగయ్య, ముసిని యాదగిరి, వర్కాల సుధాకర్ రెడ్డి,దుండిగల్ నరసింహ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**చింతపల్లి :** చింతపల్లి మండల కేంద్రంలోని తహిసిల్దార్ కార్యాలయంలో స్వాతంత్ర



సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసిల్దార్.రమాకాంత్ శర్మ,డిప్యూటీ తహిసీల్దార్ మోబిన్ , రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## డిజిటల్ ఫోటో స్టూడియో ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన ఎం.ఎస్ .డిజిటల్ ఫోటో స్టూడియోను ఎమ్మెల్యే నేనావత్.బాలు నాయక్ ప్రారంభించారు. నిర్వాకులు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌తోనే బీసీలకు సముచిత స్థానం

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సూర్యాపేట, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్‌తోనే బీసీలకు సముచితస్థానం సా‘ధ్యమవుతుందని జిల్లా కాంగ్రెస్‌నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, ప్రముఖ వైద్యలు డాక్టర్ వూర రాంమూర్తియాదవ్‌లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అ‘ద్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎన్ని కుట్రలు చేసినా ఇచ్చిన హామీ మేరకు రాహుల్‌గాం‘దీ, రేవంత్‌రెడ్డిలు బీసీ రిజర్వేషన్ హామీని నెరవేర్చారన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బీసీ ప్రజలందరు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు వెంకన్న ,చొక్కయ్యగౌడ్, వల్దాస్ దేవేందర్, మ‘దు అంజయ్య, జ్యోతి కరుణాకర్, సోమన్న, ‘దర్మ తదితరులు పాల్గొన్నారు.

# వర్టూర్‌లో బీర్ల ఫౌండేషన్ సేవా కార్యక్రమం



మోటకొండూర్, మేజర్‌న్యూస్ ః మండలంలోని వర్టూర్ గ్రామ స్థానిక గువ్వ పద్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనితమ్మ సానుభూతిగా మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు గొంగిడి సునీత ఆర్థిక సహాయం

మోటకొండూర్, మేజర్‌న్యూస్ ః మండలంలోని చాడ గ్రామంలో ఇటీవలే మృతి చెందిన గంధమల్ల రాములు, దొంతి నాగయ్య, దొంతి ముత్యాలు కుటుంబాలను బిఆర్ఎస్ మాజీ శాసనసభ్యులు గొంగిడి సునితా మహేందర్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె బాధిత కుటుంబాలకు రూ.5వేల చొప్పున అందజేసి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలను పార్టీ ఎల్లప్పుడు ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మోడీ జన్మదినం సందర్భంగా దివ్యాంగులకు సన్మానం



నార్కెట్‌పల్లి, మేజర్‌న్యూస్ ః ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సెప్టెంబర్ 17వ తేదీ నుంచి సేవాపక్షం 2025 కార్యక్రమంలో భాగంగా శనివారం నార్కెట్‌పల్లి మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ మన ప్రధానమంత్రి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దివ్యాంగులను సన్మానించటం జరిగిందన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతు ఫించన్లు కేంద్ర ప్రభుత్వ నిధుల నుంచే ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ నడింపల్లి శ్రవణ్‌కుమార్, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మునుకుంట్ల గణేష్, మాజీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్, నాయకులు నోముల రాజు, మల్లెబోయిన రమేష్, పాల్వాయి భాస్కర్ పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు

## ఎమ్మెల్యే మందుల సామెల్



అర్వపల్లి మేజర్ న్యూస్ ః ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం లో అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కోడూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇచ్చామని రైతులకు 2 లక్షల రుణమాఫీ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సామ అభిషేక్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి రషీద్, మహారాజ్, చంచల శ్రీనివాస్, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలి

## జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ సుదీర్ కుమార్

బీబీనగర్,మేజర్,న్యూస్ః విద్యుత్తు సనఫరాలో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని యాదాద్రి జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ సుదీర్ కుమార్ అధికారులు,సిబ్బందికి సూచించారు.భారీగా కురుస్తున్న వర్షాలకు మూసి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో శనివారం జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ సుదీర్ కుమార్ క్షేత్ర స్థాయిలో మూసి పరివాహక ప్రాంతాలను సందర్శించి వరదకు డ్యామేజ్ అయిన కరెంట్ పోల్స్‌లను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ తీగలు తెగిపడి ఎక్కడ ఎప్పుడు ప్రమాదం ముప్పు పొంచి ఉంటుందో తెలియని పరిస్థితి ఉందని రైతులు,ప్రజలు,విద్యుత్ సిబ్బంది కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే వాటి బారి నుండి తప్పించుకోవచ్చని తెలిపారు.ముఖ్యంగా విద్యుత్ సిబ్బంది వర్షాని కూడా లెక్క చేయకుండా ఎక్కడ సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించడం అభినందనీయమని వారు అన్నారు.వారి వెంట ఎస్ఎఓ హరీష్ కుమార్,భువనగిరి డివిజనల్ ఇంజనీర్ సంఘం వెంకటేశ్వర్లు,బీబీనగర్ ఏడీ మచందర్,ఏఈ మనోహర్ రెడ్డి,కాంట్రాక్టర్ పర్వతం మల్లేష్,విద్యుత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

## ఎమ్మెల్యే మందుల సామెల్



తుంగతుర్తి మేజర్ న్యూస్ ః గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని సంగెం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం మరియు ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమంనకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇప్పటి వరకు గ్రామానికి 14 ఇందిరమ్మ ఇండ్లు రావడం జరిగింది. ఇంకా మూడు నెలల తర్వాత మరో 10 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం, ఉచిత కరెంట్ లాంటి ఎన్నో పథకాలను అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ చింతకుంట్ల వెంకన్న, సీనియర్ నాయకులు తిరుమలప్రగడ కిషన్‌రావు, మారగాని వెంకటయ్య, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలకట్ల మల్లేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట దేవస్థానమునకు మరో అరుదైన కీర్తి




యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి మరో అరుదైన కీర్తి అందుకుంది. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవములలో భాగముగా తెలంగాణ టూరిజమ్ ఎక్సెలెన్స్ అవార్డుకు తొలి పుణ్యక్షేత్రముగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం ఎంపిక. శనివారము సంప్రదాయవేదిక శిల్పారామము నందు తెలంగాణ ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో జి.రవి నాయక్ ఐ.ఎ.ఎస్, ఎఇఓలు గజవెల్లి రఘు, జూశెట్టి కృష్ణ, ఇట్టి అవార్డును అందుకున్నారు. ఇట్టి అవార్డుకు ఈ క్షేత్రమునకు ఎంపిక చేసినందుకు తెలంగాణ టూరిజం శాఖ వారికి ధన్యవాదములు తెలుపుతూ ఇట్టి అవార్డు రావడం ఎంతో ఆనంద దాయకమని రవి నాయక్ తెలియజేశారు.

# 2వ రోజు సువార్త స్వస్థత సభలు



చింతపల్లి, మేజర్ న్యూస్ : చింతపల్లి మండలం మాల్ వెంకటేశ్వర్ నగర్ లోని అగాపే బాప్టిస్ట్ చర్చ్‌లో సువార్త స్వస్థత సభలు రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. సభలు మూడు రోజులు శుక్రవారం, శనివారం, ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంఘ పాస్టర్ సోలమోన్ రాజు, సంఘ సభ్యులు తెలిపారు. ముఖ్య ప్రసంగికులు రెవరెండ్ పాస్టర్ .బెంజమిన్ వచ్చినట్లు సంఘ సభ్యులు తెలిపారు.

సూర్య



# మంత్రి క్యాంప్ ఆఫీసులో బతుకమ్మ సంబరాలు సంబరాలు

## మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

### కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి

### విజేతలకు బహుమతులుఅందజేసిన మంత్రి



నలగొండ ప్రతినిధి, మేజర్‌న్యూస్ : బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ.. శనివారం సాయంత్రం 'వేప పూల బతుకమ్మ వేడుకలు' నల్లగొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తంగేడు,గునుగు, బంతి, పట్నం బంతి, పట్టుకుచ్చు, తామర పువ్వు,గుమ్మడి పువ్వులతో బతుకమ్మలను అందంగా అలంకరించిన మహిళలు 'చిత్తు చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మా.. అందాల బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన' అంటూ బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. క్లాక్ టవర్ సెంటర్లోని మంత్రి క్యాంప్ ఆఫీస్ వద్ద జరిగిన బతుకమ్మ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి మహిళా నాయకులతో పాల్గొని బతుకమ్మ ఆడారు. సాంప్రదాయ, పద్ధతిలో మహిళలు కలిసి సంస్కృతి- సుందరంగా బతుకమ్మలను పేర్చిన విజేతలకు రోడ్డు భవనాల శాఖ, సినిమాట్రోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భూముల మోహన్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప, గాజుల సుకన్య,కందిమల్ల నాగమణి రెడ్డి, ఎస్కే జాన్, ఎగ్గడి సుజాత, పట్టణ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, చింతపల్లి సదాలక్ష్మి, బొడ్డుపల్లి జానకి, లక్ష్మి బాయ్, వనసీత, సుజాత, సూరెడ్డి సరస్వతి, రుద్రమ్మ, రామ తులసి, నిర్మల, హైమావతి, మీరా, లక్ష్మీబాయి, త్రిపురారం, పద్మ, పింకీ తదితరులు పాల్గొన్నారు.

# లీగల్ సెల్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

### ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.సబిత

వలిగొండ, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని టేకులసోమారం గ్రామంలోని సాధన మానసిక వికలాంగుల కేంద్రం నందు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అదేశాలనుసారం, మండల న్యాయ సేవా అధికార సంస్థ అధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.సబిత హాజరై మాట్లాడుతూ మానసిక వికలాంగుల ఆశ్రమంలో ఉన్న వికలాంగులందరికీ ఇక్కడ అందించే సేవలు మరువలేనివి, మనం ఎంత చేసిన తక్కువనే అన్నారు. ఎంతో మందికి సేవా చేయాలనే నిండు మనస్సు తో ఎన్నో సేవలు చేస్తున్నారని కొనియాడారు. ఈ వైద్య శిబిరం నందు మొత్తం 30 మందికి చేవి, కండ్లు, ముక్కు దంత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు పి.సుమంత్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సిద్ది రాములు, కోశాధికారి బి.యాదగిరి, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ ఎస్పీ.ఉపేందర్ రావు, డాక్టర్లు పి.కళ్యాణ్, వి.కృష్ణ, లీగల్ సెల్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, కేంద్రం ఇంఛార్జి జ్యోతి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



# సాంకేతిక కోర్సులలో శిక్షణ ద్వారా ఉద్యోగాలు పొందవచ్చు

## ఎమ్మెల్యే కుంభం



భువనగిరి ప్రతినిధి, మేజర్‌న్యూస్ : జిల్లా కేంద్రంలోని ఐటిఐ ప్రాంగణంలో సుమారు 42.5 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాన్ని శనివారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 2400 కోట్ల రూపాయల వ్యయంతో 65 ఏటిసి కేంద్రాలను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించడం జరిగిందని టాటా సహకారంతో ఏటీసీలు ఏర్పాటు చేయడం జరిగిందని, భువనగిరి ఏటిసిని సుమారు 42.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు సమాజంలో నిరుద్యోగ సమస్య వల్ల యువత పక్కదారి పడుతుందని గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఏటీసీలను ఏర్పాటు చేశారని, యువతకు టీఎస్పీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తునే ఒక వైపు ప్రైవేట్ సెక్టార్‌లో కూడా ఉద్యోగ ఉపాధి అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నదని తెలిపారు. యువత కష్టపడి చదవాలని, తద్వారా ఉద్యోగాలు సాధించవచ్చని అన్నారు. మీ భవిష్యత్తు మీ కష్టం పైన ఆధారపడి ఉంది. అందువల్ల రెండు సంవత్సరాలు బాగా కష్టపడి చదువుకుంటే 40 సంవత్సరాలు సుఖపడతారు" అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే యువతకు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం హనుమంత రావు మాట్లాడుతూ ఒకేషనల్ శిక్షణ ఉంటే ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. డిగ్రీ ఇతర చదువుల ద్వారా మాత్రమే కాకుండా సాంకేతిక విద్య ద్వారా ప్రభుత్వ ఉద్యోగం తో పాటు, ప్రైవేటు ఉద్యోగాలు పొందవచ్చు అన్నారు. ఏటీసీలలో శిక్షణ పొందిన వారికి భవిష్యత్తులో పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపార ఈ కార్యక్రమంలో భువనగిరి ఏటి సి ప్రిన్సిపల్ కె.పి జయ ట్రైనింగ్ ఆఫీసర్ జి ఎస్ రామానంద్ జిల్లా లైబ్రరీ చైర్మన్ అవేశ్ శిస్తి,టిజిఐఐసి జోనల్ మేనేజర్ భావని, ఐఐటి సిబ్బంది విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.

# శ్రీ పద్మావతి అమ్మవారికి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి వసంతోత్సవం



భువనగిరి ప్రతినిధి, మేజర్ న్యూస్ : జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాం బరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహెూత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహెూత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. ధాన్య సమృద్ధికై ధాన్యలక్ష్మి హెూమాన్ని నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరిం చారు. ధాన్యలక్ష్మి అమ్మవారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం ధాన్యలక్ష్మి అమ్మవారిని దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు. దసర శరన్నవరాత్రోత్సవాల్లో ఆరవ రోజు భాగంగా ధాన్యలక్ష్మి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు విశేషంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

# దౌర్జన్యానికి పాల్పడుతున్న వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలి

## సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ సంస్థ చైర్మన్ కెవికె రావు



భూధాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : కొందరు గుర్తుతెలియని వ్యక్తులు జెసిబిలతో వచ్చి సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాల భూమి లో దౌర్జన్యం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాల సంస్థ చైర్మన్ కెవికె రావు ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూధాన్ పోచంపల్లి మండల పరిధిలోని దేశ్ ముఖి గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 13, 187,,191లో 28. 17 ఎకరాల భూమిలో తమభూమి ఉందని పేర్కొన్నారు. రామారావు వినోద్ కుమార్ లు ప్రముఖ నాయకుల బంధువుల మని చెబుతున్నారని , మూడు జెసిబిలతో శివ ,శంకర్ ,రవి వ్యక్తులు వచ్చి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . ఈ విషయమై స్థానిక ఎస్సై భాస్కర్ రెడ్డికి ఫిర్యాదు చేయగా వెంటనే ఇద్దరు కానిస్టేబుల్ పంపించారని తెలిపారు. సమస్యను పరిష్కరించ కుండ ఫారెస్ట్ వాళ్ళ అనుమతితో చేట్లను తొలగించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు . సివిల్ విషయమని కోర్టులో పెండింగ్ ఉందని తెలిపారు. తాను చెప్పిన రేటు కే భూమిని కొనుగోలు చేయాలని లేకపోతే మరల జె సిబిలతో వచ్చి విధ్వంసం చేస్తామని హెచ్చరించినట్లు తెలిపారు. ఈ విషయమై రాచకొండ సిపి, డిసిపి కి ఫిర్యాదు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

# చేనేత పరిశ్రమ అభివృద్ధికి కృషి

## భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

భూధాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : చేనేత పరిశ్రమ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారము భూదాన్‌పోచంపల్లి పురపాలక కేంద్రంలోని చేనేత సహకార సంఘం 69వ వార్షిక సర్వసభ్య సమావేశం చైర్మన్ భారత వాసుదేవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార జెండాను ఆవిష్కరించి అనంతరం ఆచార్య కొండా లక్ష్మణ్ బాబు జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సర్వ సభ్యులు ఆమోదాలు తెలిపారు. సంఘ మిక్స్ సంబంధించిన సంఘ సభ్యులు సంఘం ఎంక్వయిరీ పెట్టించి సంఘానికి ఇబ్బంది అభివృద్ధికి విగాథం కలిగించినందుకు దానిపై చర్చించి వారిపై చర్యలు తీసుకోవాలని సభ తీర్మానం చేశారు. సంఘ సభ్యులు సుమారు 186 మంది వారి సభ్యత్వాలు వారి కుటుంబ సభ్యుల పేరుపై మార్చుటకు సభ ఆమోదించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని చేనేత సహకార క్యాష్ క్రెడిట్ రుణాలు 40 కోట్ల రుణాలను మాఫీ చేపించేందుకు ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సహకరిస్తానని ఆయన హామీ ఇస్తానని మార్కెట్ అనుగుణంగా చేనేత కళాకారులు వినూత్న డిజైన్లను రూపొందించి చేనేత పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షులు సీత శ్రీరాములు, చేనేత రాష్ట్ర నాయకులు తడక వెంకటేశ్వర్లు, చేనేత నాయకులు పిల్లలమర్రి శ్రీనివాస్, బడుగు దానయ్య,పట్టణ నాయకులు భారత లవ కుమార్, పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, సీత సత్యనారాయణ, సహకార సంఘం డైరెక్టర్లు సురపల్లి శ్రీనివాస్, అంకం మురళి, సీతా చక్రపాణి, సిద్దుల రామచంద్రన్, గంజి అంజయ్య, గుండు వెంకటేష్, పగడాల బుచ్చమ్మ, భారత భారతమ్మ, మేనేజర్ రుద్ర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

